సాక్షి నిజామాబాద్

I

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023

ఘనంగా రంజాన్



జిల్లాలో ముస్లింలు రంజాన్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని మసీద్‌లలో, బోధన్, ఆర్మూర్, భీంగల్ పట్టణాలతో పాటు అన్నిమండల కేంద్రాల్లో ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్త దుస్తుల్లో చిన్నారులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. – నిజామాబాద్ సిటీ



జిల్లా ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

న్యూస్‌రీల్

నేడు గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 2023–24కు గాను 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం (23న) వీటీజీ సెట్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ఆర్‌సీవో మేరీ ఏసుపాదం, డీసీవో సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని, నిజామాబాద్ రీజియన్ పరిధిలోని నిజామాబాద్‌లో 17, కామారెడ్డిలో10, నిర్మల్ జిల్లాలో 16 మొత్తం 43 పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఎగ్జామ్ సెంటర్‌కు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, తమ వెంట హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, రెండు బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు తీసుకువెళ్లాలన్నారు.

ఇందల్వాయి రైల్వేగేటు మరమ్మతు పనులు ప్రారంభం

ఇందల్వాయి : ఇందల్వాయి రైల్వే గేటు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు శనివారం ప్రారంభమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆది, సోమవారాలు కొనసాగుతాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి పనులు పూర్తయ్యేవరకు తిర్మన్‌పల్లి–రాంపూర్–కమలాపూర్–డిచ్‌పల్లి మీదుగా ప్రయాణాలు సాగించాలని అధికారులు కోరారు.

ఒకరికి పాజిటివ్

నిజామాబాద్ సిటీ : జిల్లాలో శనివారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో ఒకరికి పాజిటివ్ వచ్చిందని డీఎంహెచ్‌వో ఎం సుదర్శనం తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా మొత్తం 45 మందికి కరోనా పరీక్షలు చేయగా ఒకరికి కరోనా పాజిటివ్‌గా తేలిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం పది మంది కరోనా బారిన పడ్డారని ఆయన పేర్కొన్నారు.

'గంగా హారతి'లో పాల్గొన్న జిల్లా జడ్జి




ఖలీల్‌వాడి : అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని బాసర శ్రీ సరస్వతి అమ్మవారిని నిజామాబాద్ సెషన్స్ జిల్లా జడ్జి సునీతా కుంచాల శనివారం దర్శించుకున్నారు. అనంతరం బాసర పుణ్యక్షేత్రం గోదావరి నది ఒడ్డున శివాలయం శివపూజ, గంగా హారతిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, జూనియర్ సివిల్ జడ్జి భవ్య పాల్గొనగా వేదపండితులు పూజలు నిర్వహించి వారిని ఆశీర్వదించారు.

ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

నిజామాబాద్ అర్బన్ : టెక్ బీ – హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో 2022–23లో ఇంటర్ పూర్తి చేసుకున్న ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు శిక్షణతో ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్లు డీఐఈవో రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న నగరంలోని ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో ఈ శిక్షణ ఉద్యోగ ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2022–23లో ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీలో 70శాతం మార్కులు సాధించి ప్రత్యేకంగా గణితంలో 60శాతం మార్కులు సాధించిన వారు ఎంపికలో పాల్గొనాలన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, ఎనలిస్ట్ డిజైన్ ఇంజనీర్, డేటా ఇంజనీర్, సపోర్ట్ ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలుంటాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్‌తో పాటు రూ. 10 వేల స్టైఫండ్ ఇస్తారన్నారు. ఉద్యోగాన్ని బట్టి ఏడాదికి రూ. 2.22లక్షల ప్యాకేజీతో కెరియర్ ప్రారంభమవుతుందని, 8074065803, 94935 53821లో సంప్రదించాలన్నారు.

ఘనంగా రాధాకృష్ణ కల్యాణం



నిజామాబాద్ సిటీ : నగరంలోని మారుతినగర్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగా మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి రాధాకృష్ణ శాంతి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈనెల 20న నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం భారీ ఈదురు గాలులు, వర్షం కారణంగా నిలిచిపోయింది. దీంతో కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించగా పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. దీంతో విశ్వశాంతి మహాయాగ మహోత్సవ కార్యక్రమాలు ముగిశాయి.

రాష్ట్ర పరి'పాలన'లో మనోళ్లు

ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులు రాష్ట్రస్థాయిలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వివిధ శాఖల్లో కీలకమైన పోస్టుల్లో సేవలందిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పార్థసారథి, ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా లింబాద్రితోపాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఇందూరు ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. పరిపాలనా వ్యవహారాల్లో ఎంత బిజీగా ఉన్నా అప్పుడప్పుడు సొంతూళ్లకు వస్తూ, తమ ప్రాంత అభివృద్ధికి సహకారం అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. – సాక్షి, కామారెడ్డి

- ఉన్నత స్థానాలలో ఉమ్మడి జిల్లావాసులు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆర్మూర్‌వాసి
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌ది రావుట్ల
- కీలక స్థానాల్లో మరికొందరు అధికారులు



రాష్ట్ర ఎన్నికల కమిషనర్..

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన ఐఏఎస్ అధికారి సి.పార్థసారథి పలు జిల్లాల్లో పనిచేశారు. ఆర్డీవోగా, డీఆర్‌డీఏ పీడీగా, జేసీగా, కలెక్టర్‌గా, యూనివర్సిటీల ఇన్‌చార్జి వీసీగా, వ్యవసాయ శాఖ కమిషనర్‌గా, సహకార శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2020 సెప్టెంబర్‌నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతున్నారు.

సీఎం సహాయ కార్యదర్శి..

కామారెడ్డి పట్టణానికి చెందిన పి.లింగమూర్తి ముఖ్యమంత్రి కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్–2 ద్వారా సచివాలయ ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. ఇప్పుడు సీఎం సహాయ కార్యదర్శి స్థాయికి ఎదిగారు.

చంచల్‌గూడ జైల్ సూపరింటెండెంట్..

పిట్లం మండల కేంద్రానికి చెందిన నవాబ్ శివకుమార్‌గౌడ్ చంచల్‌గూడ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో జైళ్లలో కీలకమైనది చంచల్‌గూడ జైలే. దానికి శివకుమార్‌గౌడ్ సూపరింటెండెంట్‌గా ఉన్నారు.

జీహెచ్ఎంసీ ఈఎన్‌సీ..

కామారెడ్డి పట్టణానికి చెందిన ఆర్.శ్రీధర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్..

నిజాంసాగర్ మండలం మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన పాండురంగ నాయక్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. రవాణా శాఖలో ఆయన అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్..

సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన లింబాద్రి సాధారణ కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులతో ఉన్నత స్థాయికి ఎదిగారు. విద్యాబోధనలో ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన తెలంగాణ యూనివర్సిటీలో డీన్ ఫ్యాకల్టీగా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం చైర్మన్‌గా, రిజిస్ట్రార్‌గా, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

పంచాయతీరాజ్ ఈఎన్‌సీ..

మాచారెడ్డి మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన ఐలేని సంజీవరావు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖలో సాధారణ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరిన సంజీవరావు అంచెలంచెలుగా ఎదిగారు.

వైద్య విధాన పరిషత్ కమిషనర్..

కామారెడ్డిలో స్థిరపడిన డాక్టర్ అజయ్‌కుమార్ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో కామారెడ్డి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, డీసీహెచ్ఎస్‌గా పనిచేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య విజయలక్ష్మి కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్నారు.

పీఎఫ్ జాయింట్ కమిషనర్..

నిజామాబాద్ నగరానికి చెందిన శ్రీనివాస్ ప్రావిడెంట్ ఫండ్ జాయింట్ కమిషనర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పీఎఫ్‌కు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ పీఆర్వో..

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన బొజ్జా అనిల్‌కుమార్ సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. రైల్వే శాఖలో అసిస్టెంట్ పీఆర్వోగా, పీఆర్వోగా పనిచేసిన ఆయన పదోన్నతిపై సీనియర్ పీఆర్వో అయ్యారు.

టీఎస్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్..

భిక్కనూరు మండలం బస్వాపూర్‌కు చెందిన గంప గోపాల్ తెలంగాణ రాష్ట్ర సౌతర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీఎస్ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్‌గా విధుల్లో ఉన్నారు. ఆయన భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆయనను టీఎస్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్‌గా నియమించింది.

జువైనల్ హోం నుంచి నలుగురు పరార్

- ఇద్దరు సూపర్‌వైజర్లు సస్పెండ్

ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో గల జువైనల్ హోం నుంచి నలుగురు బాలురు పరారయ్యారు. వీరిలో ముగ్గురు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వారు కాగా మరొకరు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌కు చెందిన బాలుడు ఉన్నారు. వీరందరూ చోరీ కేసులో జువైనల్ హోంలో శిక్షను అనుభవిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు డిన్నర్ తర్వాత సిబ్బంది గదులను, బాత్రూమ్‌లకు రోజూ మాదిరిగా చెక్ చేస్తుండగా బాలురు గది బయట హాలులో ఉన్నారు. ఈ క్రమంలో హాలులోని ఇనుప గ్రిల్స్‌ను తొలగించి పరారయ్యారు. అక్కడున్న సూపర్‌వైజర్లు బాలుర కోసం వెతికినా కనిపించకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిధిలో గాలింపు జరిపినా బాలుర ఆచూకీ లభించలేదు. జువైనల్ హోమ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహ్మద్ ఒమర్ ఆదిలాబాద్, ఆర్మూర్, నిజామాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. బాలుర కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. బాలురు ఇంటికి వస్తే జువైనల్ హోంకు సమాచారం అందించాలని సూచించారు. శనివారం సూపరింటెండెంట్ మహ్మద్ ఒమర్ నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జువైనల్ హోం డైరెక్టర్ డాక్టర్ రాజాఆలీ బేగ్ పరారైన బాలుర వివరాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. బాలురు ఇనుప చువ్వలు తొలిగించి పరారైన ప్రాంతాన్ని పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. విధులలో అజాగ్రత్తగా వ్యవహరించిన ఇద్దరు సూపర్‌వైజర్‌లు నాగేందర్, ప్రభాకర్‌లను సస్పెండ్ చేశారు. గత ఏడాది ఇదే జువైనల్ హోం నుంచి ముగ్గురు బాలురు పరారైన విషయం తెలిసిందే.

కేంద్రాల్లో సమస్యలుంటే చెప్పండి

- ధాన్యం సేకరణ ప్రక్రియలో వేగం పెరగాలి
- ఇప్పటివరకు 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), మెంట్రాజ్ పల్లి గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. కేంద్రాల్లో సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగు నీరు, షామియానాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు వెంటవెంటనే బిల్లుల చెల్లింపులు జరిగాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్నివెంటనే లారీల్లో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఓటీపీ సమస్యను పరిష్కరిస్తామని, ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లయ్ డీఎం జగదీష్, డిచ్‌పలి తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కడ్తా లొల్లి..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కడ్తా పేరుతో రైతుకు దగా
- కడ్తా తప్పదని చెబుతున్న నిర్వాహకులు
- క్వింటాలుకు 7 కిలోల దాకా తీయడానికి ఏర్పాట్లు



మోర్తాడ్‌లో తూకం వేయడానికి సిద్ధంగా ఉన్న వరి ధాన్యం

మోర్తాడ్(బాల్కొండ) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కడ్తా పేరుతో తూకం వేసిన ధాన్యం పరిమాణాన్ని తగ్గించే తంతుకు మళ్లీ తెరలేపారు. ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉన్నా, ధాన్యంను శుద్ధి చేసినా తరుగు తీయడం తప్పదనే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 458 కొనుగోలు కేంద్రాల ద్వారా యాసంగి సీజన్ ధాన్యం సేకరణను అధికార యంత్రాంగం ఆరంభించింది. ఈసారి తరుగు తీయడం లేదని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో మాత్రం తరుగు తీయడం ఎప్పటిలాగే సాగిపోతోంది.

వాటాలు ఉన్నందుకే..

తరుగు తీసిన ధాన్యం డబ్బులో అందరికి వాటా ఉండటం వల్లనే ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక సంచిలో 40 కిలోల చొప్పున ధాన్యంను నింపాల్సి ఉంది. అధికారికంగా తరుగు తీయడానికి ఒక కిలో ధాన్యంను ఎక్కువగానే తూకం వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంను లోడ్ చేసే సమయంలో 1.50 కిలోల ధాన్యం తరుగు తీయాల్సి వస్తుందని నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు ఆశాజనకంగా ఉండకపోవడంతో రైతులు గత్యంతరం లేక ధాన్యంలో మరింత తరుగు తీయడానికి అంగీకరిస్తున్నారు. తీరా రైస్‌మిల్లులకు ధాన్యంను తరలించిన తర్వాత అన్‌లోడింగ్ చేయడానికి మరో కిలోన్నర తరుగు తీయడం తప్పడం లేదని వెల్లడిస్తుండటంతో రైతుల గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు అవుతుంది. క్వింటాలు ధాన్యంకు ఏడు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యంకు రూ.2,060 మద్దతు ధర ఉండటంతో ఒక్కో క్వింటాలు వెంట రైతులకు రూ. 144 నష్టం కలుగుతుంది. వంద క్వింటాళ్ల ధాన్యం రైతులు రూ.14,420 చొప్పున కోల్పోతున్నారు.

"తరుగు తీయడం దోపిడీయె..



వరి ధాన్యం విక్రయించడానికి వెళ్తున్న రైతుల నుంచి తరుగుతీత పేరుతో దోపిడీకి పాల్పడటం కొనసాగుతుంది. రైతులు సంఘటితమై ఆందోళన చేస్తేనే ప్రజాప్రతినిధులు, అధికారులకు బుద్ధి వస్తుంది. ఇకనైనా దోపిడిని ఆపాలి లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. – గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రైతు, దొన్కల్

రైతులను వంచిస్తున్నారు



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్న రైతులను వంచిస్తున్నారు. తరుగు తీయడం అవసరం లేకున్నా నిర్వాహకులు తమ స్వలాభం కోసం తరుగు తప్పనిసరిగా తీస్తున్నారు. రైతులకు నష్టం జరుగుతున్నా ప్రజాప్రతినిధులు నోరు మెదకపోవడం మంచిది కాదు. – ఒల్లెం సంతోష్, రైతు, మోర్తాడ్

రైతన్న ఆగ్రహం

- మోర్తాడ్ సహకార సంఘం ఎదుట తొమ్మిది గంటల పాటు ఆందోళన



సహకార సంఘం భవనం గేట్‌కు తాళం

మోర్తాడ్(బాల్కొండ) : యాసంగి ధాన్యం కొనుగోళ్ల విషయంలో తరుగుతీతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తొమ్మిది గంటల పాటు శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నా సమయంలో సహకార సంఘం చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి, డైరెక్టర్ ఎలాల భూమారెడ్డి, సీఈవో కాశీరాం ఇతర ఉద్యోగులను కార్యాలయంలో నిర్బంధించిన రైతులు తమ ఆందోళనను కొనసాగించారు. మోర్తాడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లరు అన్‌లోడింగ్ చేసుకున్నా అన్‌లోడింగ్ కాలేదని ఒక్కో సంచికి 1.50 కిలోల తరుగు తప్పనిసరని నిర్వాహకులు వెల్లడించడం ఇది తప్పని రైతులు ఆధారాలు చూపడం గమనార్హం. 20వ తేదీనే ధాన్యంను రైస్‌మిల్లులో అన్‌లోడింగ్ చేసినట్లు తమ వద్ద ఆధారం ఉన్నా ఇంకా తరుగు తీస్తేనే ధాన్యం అన్‌లోడింగ్ జరుగుతుందని సంఘం నిర్వాహకులు వెల్లడించడంతో రైతులు ఆగ్రహించారు. సహకార సంఘం వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. అప్పుడే వచ్చిన చైర్మన్, డైరెక్టర్, సీఈవోలను నిర్బంధించి సంఘం గేట్‌కు తాళం వేశారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు వచ్చి రైతులకు నచ్చజెప్పినా వారు వినకపోవడంతో ఆయన వెళ్లిపోయారు. సంఘటనాస్థలానికి ఏర్గట్ల ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ పోలీసులను రప్పించారు. చివరికి తహసీల్దార్ బావయ్య వచ్చి సోమవారం డీసీవో, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఇతర ఉన్నతాధికారులతో తరుగుతీతపై సమాధానం ఇప్పిస్తామని, కేంద్రాల నిర్వాహకులు తరుగు తీయకుండా చూసేలా అధికారులు హామీ ఇస్తారని చెప్పగా వారు ఆందోళన విరమించారు.



మోర్తాడ్ సహకార సంఘం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

క్లుప్తంగా

తాడ్వాయివాసికి డాక్టరేట్‌


రాజేశ్వర్‌గౌడ్‌

తాడ్వాయి: తాడ్వాయికి చెందిన జంగంపల్లి రాజేశ్వర్‌గౌడ్‌ డాక్టరేట్‌ పట్టాను పొందాడు. రాజేశ్వర్‌గౌడ్‌ ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో కాకినాడ జేఎన్‌టీయూ నుంచి ఈ నెల 20న డాక్టరేట్‌ అందుకున్నారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్‌ శిక్షణ శిబిరం ప్రారంభం



డిచ్‌పల్లి: రాష్ట్ర గురుకుల పాఠశాలల పరిధిలో నిర్వహిస్తున్న వేసవి సాఫ్ట్‌ బాల్‌ శిక్షణ శిబిరాన్ని మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాలలో శనివారం సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. సొసైటీ శిక్షణ శిబిరం చేయడం సంతోషంగా ఉందన్నారు. క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ గోదావరి, అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి నవీన్‌, స్వరూప, శారద, పీడీ ఉదయశీల, నల్లూరి లత, కోచ్‌ వేముల మౌనిక పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌ ఆర్టీజన్‌(ఆపరేటర్లు)ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 25నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలంగాణ విద్యుత్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఏ–82 రాష్ట్ర కార్యదర్శి మెట్టు జాషువా తెలిపారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ విద్యుత్‌ సంస్థల యాజమాన్యానికి ఈ నెల 6న సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. హనుమయ్య, శ్రీకాంత్‌, రవి, ఎన్పీడీసీఎల్‌ అధ్యక్ష కార్యదర్శులు శామంతి, నవీన్‌, చోక్కాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రుద్రూర్‌: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోతంగల్‌ మండలం సుంకిని సమీపంలోని మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు.

రైతులను వెంటాడుతున్న వాన

- నేలపాలవుతున్న చేతికొచ్చిన పంట
- తడిసిన ధాన్యం ఆరబెట్టడానికి అన్నదాతల తిప్పలు


సిరికొండ మండలం గడ్కోల్‌లో ధాన్యంలో చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు


నల్లవెల్లిలో నేలకొరిగిన నువ్వు పంట

ధర్పల్లి: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. మామిడి పంట నేలరాలింది. కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టగా వర్షం నీటికి వడ్లు కొట్టుకుపోయాయి.

సిరికొండ: సిరికొండతో పాటు గడ్కోల్‌ పెద్దవాల్గోట్‌ తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. విపరీతమైన గాలి వీయడంతో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు లేచిపోయి ధాన్యం తడిసిపోయింది.

ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. గాలులకు ఇందల్వాయి– ధర్పల్లి మార్గంలో చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గన్నారంలో విద్యుత్‌ స్తంభం విరిగిపడి ట్రాన్స్‌ఫార్మర్‌ కింద పడింది.


గన్నారంలో విరిగి పడిన విద్యుత్‌ స్తంభం


ఇందల్వాయి - ధర్పల్లి మార్గంలో నేలకొరిగిన చెట్టు

ఎడపల్లి: వర్షాలకు ఎడపల్లిలో, రాణాకలాన్‌లో వరిపంట నేలకొరగగా, ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయి రైతన్నలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.


ధర్పల్లిలో తడిసిన ధాన్యం


రాణాకలాన్‌ శివారులో నేలకొరిగిన వరి పంట


తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

భూమిని రక్షించుకుందాం



డిచ్‌పల్లి: భవిష్యత్‌ తరాల కోసం భూమిని రక్షించుకుందామని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్‌ ఎస్‌.శ్రీనివాస్‌, డీపీఎం రాచయ్య అన్నారు. ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకుని సంస్థలో టైలరింగ్‌, మగ్గం వర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులతో కలిసి డిచ్‌పల్లిలో ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

తెయూలో ధరిత్రి దినోత్సవం



తెయూ(డిచ్‌పల్లి): రాబోయే భవిష్యత్‌ తరాల కోసం భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ స్టూడెంట్స్‌ ఫర్‌ డెవలప్‌మెంట్‌ (ఎస్‌ఎఫ్‌డీ) కన్వీనర్‌ నవీన్‌ అన్నారు. శనివారం తెయూ క్యాంపస్‌లో ఎస్‌ఎఫ్‌డీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఏబీవీపీ స్టేట్‌ వర్కింగ్‌ కమిటీ మెంబర్‌ శివ, ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్‌ ప్రమోద్‌, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు సాయికృష్ణ, మనోజ్‌, మహర్షి, మహేష్‌, జయంత్‌ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆర్మూర్‌ జెడ్పీ బాలుర పాఠశాల 1972-73 బ్యాచ్‌ విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర పాఠశాలలో 1972–73 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు పట్టణంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. రాంచందర్‌ హండే, దినేష్‌ వైద్య, జగన్‌, డీజీ శివకాంత్‌, హజారి గంగాధర్‌, సాత్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.


వెంకటేశ్వర విద్యాలయం 1985-86 బ్యాచ్‌ విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని బ్రహ్మపురిలో గల వెంకటేశ్వర విద్యాలయంలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్‌లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు సంగీత, వాణి శోభ, విజయలక్ష్మి, శోభగౌడ్‌, లక్ష్మీరాజ్యం, జయశ్రీ,, పద్మ, ముక్క అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

- నిలిచిపోయిన తాండూర్‌ – ముద్దాపూర్‌ రోడ్డు పనులు
- 8 ఏళ్ల క్రితం నిధులు మంజూరు
- టెండర్‌ రద్దు చేసే ఆలోచనలో అధికారులు


తాండూర్‌ గేట్‌ సమీపంలో నిలిచిన రోడ్డు పనులు

నాగిరెడ్డిపేట: ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభమైన రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి, మెదక్‌ జిల్లాలను అనుసంధానం చేస్తూ నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామశివారులో గల మంజీర నదిపై వంతెన నిర్మాణం చేయడంతోపాటు తాండూర్‌ గేటు నుంచి వెంకంపల్లి మీదుగా మెదక్‌ జిల్లా పాపన్నపేట మండలం ముద్దాపూర్‌ వరకు రెండు వరుసల రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 2014లో రూ.33కోట్లు మంజూరు చేసింది. వీటిలో మంజీర నదిపై వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు, తాండూర్‌ గేట్‌ నుంచి మంజీర వరకు రెండువరసల రోడ్డు కోసం రూ.21కోట్లు కేటాయించారు. సుమారు రెండేళ్లక్రితం వంతెన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. కానీ తాండూరుగేటు నుంచి మంజీరనదిపై నిర్మించిన వంతెన వరకు చేపట్టిన రోడ్డుపనులు మాత్రం నిలిచిపోయాయి.

అనుమతులు రాకపోవడంతో..

తాండూర్‌గేట్‌ నుంచి మంజీర నది వరకు సుమారు 5.5కిలోమీటర్లమేర రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు రూ.21కోట్ల నిధులను కేటాయించారు. ఇందుకోసం ఆర్‌అండ్‌బీ అధికారులు 2015లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులను ప్రారంభించారు. తాండూర్‌గేట్‌ సమీపంలో పనులు చేపట్టే ప్రాంతంలోని సుమారు ఒక కిలోమీటర్‌ రోడ్డు అటవీశాఖ పరిధిలోకి రావడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. దీనికితోడు మరో 600మీటర్ల రోడ్డుకు సంబంధించి స్థలం స్వాధీన పర్చుకునే ప్రక్రియకు సంబంధించి కోర్టు కేసు కొనసాగుతున్న నేపథ్యంలో పనులు ముందుకు సాగలేదు. దీంతోపాటు రోడ్డుపనులను కొనసాగించేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు పొందేందుకు గతంలోనే అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. కానీ అటవీశాఖ నుంచి అనుమతులు రావడంలో జరుగుతున్న జాప్యం కారణంగా సంబంధిత కాంట్రాక్టర్‌ పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోగా తాను వేసిన టెండర్‌ను పూర్తిగా రద్దు చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది.

50శాతం పనులు మాత్రమే పూర్తి

2015లో ప్రారంభించిన రోడ్డు పనులు ఇప్పటివరకు 50శాతం మాత్రమే పూర్తి కావడం గమనార్హం. పనులు చేపట్టి సుమారు ఎనిమిదేళ్లు కావస్తున్నా సగం పనులు మాత్రమే పూర్తవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పనులు చేసిన కాంట్రాక్టర్‌ తన టెండర్‌ను రద్దు చేసుకుంటే అధికారులు తిరిగి కొత్తటెండర్‌ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్‌: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెమ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన శనివారం ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంపై గ్రామస్తులను అభినందించారు. సర్పంచ్‌ గంగమణి, ఎంపీటీసీ నాయిణి రాధ, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ మురళి, నాయకులు భూమేష్‌, హన్మండ్లు, వీరారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భీమ్‌గల్‌: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన భీమ్‌గల్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వేల్పూర్‌ మండలం మోతె గ్రామానికి చెందిన కత్రజీ రంజీత్‌(27) భీమ్‌గల్‌ మండలం బాబాపూర్‌లో వడ్రంగి పని చేస్తాడు. శనివారం సిరికొండ నుంచి భీమ్‌గల్‌ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనంతో ఓవర్‌ టేక్‌ చేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో బైక్‌ అదుపు తప్పి బస్సు వెనుక చక్రాల క్రింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్‌

బీబీపేటలో భారీ చోరీ

- తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగతనం

బీబీపేట: తాళం వేసి ఉన్న ఇళ్లలో చొరబడి భారీగా ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాండ్ల నరేష్‌ తన కుటుంబంతో కామారెడ్డిలో ఉండడంతో స్థానికంగా ఉన్న ఇంటికి తాళం వేసి మరో గదిని జంగిటి సందీప్‌కు కిరాయికి ఇచ్చాడు. సందీప్‌ కుటుంబం కూడా బంధువుల ఇంటికి వెళ్లింది. రెండు ఇళ్లకు తాళం వేసి ఉండడంతో శుక్రవారం రాత్రి దొంగలు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి నరేష్‌ ఇంట్లో 24.5 తులాల బంగారు ఆభరణాలు, సందీప్‌ ఇంట్లో సైతం అరతులం బంగారం, రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారు. కామారెడ్డి నుంచి నరేష్‌ వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే తంగళ్లపల్లి విజయ వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌కు వెళ్లగా ఆమె ఇంట్లో కూడా చోరీ చేశారు. తులం బంగారం, రూ. 30 వేల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు క్లూస్‌ టీంను రప్పించి వివరాలు సేకరించారు.

వివాహిత అదృశ్యం

బాల్కొండ: బాల్కొండ మండలం వన్నెల్‌(బి)కి చెందిన మాక్లూర్‌ అనూష(19) రెండు రోజుల నుంచి కనిపించడం లేదని ఎస్సై గోపి తెలిపారు. మార్చిలో వన్నెల్‌(బి)కి చెందిన రాజుతో అనూష వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం బాగాలేక పోవడంతో శుక్రవారం మండలంలోని బస్సాపూర్‌ శివారులో తెప్ప తీయుటకు వెళ్లారు. భర్తతో కలిసి తిరుగు ప్రయాణంలో బాల్కొండలో వన్నెల్‌(బి) చౌరస్తా వద్ద నీరు తాగి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో ఒకరు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌ కాలనీ చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ సమస్యల కారణంగా అయిత సమన్విత ఈనెల 20న మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చాలా చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆమె భర్త నిశ్వాంత్‌ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చిన్నమల్లారెడ్డి లో మరొకరు..

కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన కర్రోళ్ల లక్ష్మి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్‌ తెలిపారు. ఈనెల 18న ఆమె కూలి పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో చాలా చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో భర్త రవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజంపేటలో మరోవ్యక్తి

రాజంపేట: రాజంపేట గ్రామానికి చెందిన గంగు బాల్‌లింగం (50) శుక్రవారం రాత్రి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాల్‌లింగం భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ప్రాణాలు తీసే జొన్నలాప

- పశువులకు వేయొద్దంటున్న పశువైద్యులు



బాల్కొండ: జొన్నపంట కోసిన తర్వాత మొలకెత్తిన లాప పశువులకు మంచిది కాదని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. శనివారం మెండోరా మండలం కోడిచర్లలో జొన్నలాపను తిని ఆరు గేదెలు మృతి చెందాయి. జొన్నలాపను తింటే పశువులు చనిపోతాయని అధికారులు చెబుతున్నారు. జొన్న సొప్ప తినడం పశువులకు మంచి బలమైన ఆహారం కానీ లాప విషమంటున్నారు. జొన్నలాపలో సైనడ్‌ అనే విష పదార్థం ఉంటుందన్నారు. పశువులు మేస్తే వెంటనే మరణించే ప్రమాదం ఉందన్నారు. జొన్న లాప తిన్న తర్వాత వెంటనే పశువులకు నీరు పెడితే వెంటనే నరాల ద్వారా విషం పాకుతుందన్నారు. ఒక వేల ప్రమాదవశాత్తు జొన్న లాపను పశువులు మేసినా.. వెంటనే నీరు పెట్టవద్దంటున్నారు. రైతులు జొన్న లాప రాకుండా వెంటనే దుక్కి దున్నాలని సూచిస్తున్నారు. జొన్న పంట కోసిన వెంటనే మొదళ్ల నుంచి లాప వస్తుంది. 15 నుంచి 20 రోజుల తర్వాత లాపను తింటే మరింత ప్రమాదం అంటున్నారు. జొన్నలాపను మేస్తే వెంటనే గ్లూకోజ్‌ పెట్టాలన్నారు.

జొన్న పంట పండించిన తర్వాత కోసే జొన్న సొప్ప తినడంతో పశువులు బలంగా తయారవుతాయి. అంతేగాకుండా గేదెలు అధికంగా పాలు ఇస్తాయి. అదే జొన్న సొప్ప కోసిన తర్వాత వచ్చే లాపను తింటే ప్రాణాలే వదిలే పరిస్థితి ఉంది. ప్రస్తుతం జొన్న పంట కోత కోయగానే వెంటనే రొటవేటర్‌ చేయడంతో అంతగా జొన్నలాప ఉండటం లేదు. కానీ పశువుల మేత కోసం సొప్ప కోసే పంట భూముల్లో లాప పెరుగుతుంది.

జొన్నలాప తిని ఆరు గేదెల మృతి

బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్లలో జొన్న లాపను తిని ఆరు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని గేదెల మంద రోజు మాదిరిగానే పంట భూముల్లో మేతకు వెళ్లింది. గ్రామ శివారులోని పంట భూమిలోని జొన్నలాపను తిన్నాయి. వెంటనే పక్కన ఉన పంట భూముల వద్ద నీరు సేవించాయి. కొంత సమయం తరువాత గేదెలు అస్వస్థకు గురయ్యాయి. దీన్ని గమనించిన గేదెల కాపరి గ్రామస్తులకు సమాచారమందించాడు. వారు పశువైద్యులకు సమాచారం అందించారు. అప్పటికే ఆరు గేదెలు మృతి చెందాయి. పశువైద్యుడు గౌతం రాజు ఆధ్వర్యంలో మిగతా గేదెలకు చికిత్స అందించారు.


కోడిచర్లలో మృతి చెందిన గేదెలు


గేదెలకు చికిత్స అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

- కారకుల ఇంటి ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధితులు

బీబీపేట: బీబీపేటకు చెందిన గడ్డమీది ఐలయ్య (60) శనివారం కామారెడ్డి శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఐలయ్య ఆత్మహత్యకు అదే కులానికి చెందిన రెండు కుటుంబాల సభ్యులే కారణమని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ మృతదేహాన్ని ఇంటి ముందు ఉంచి ఆందోళనకు దిగారు. కుల సభ్యులకు చెందిన ఒక స్థలాన్ని అందరు కలిసి అమ్మేశారు. అమ్మిన వెంటనే వచ్చిన డబ్బులను అందరు పంచుకున్నారు. డబ్బులు పంచుకున్న రెండు కుటుంబాల సభ్యులు రిజిస్ట్రేషన్‌కు సహకరించపోవడంతో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ గొడవలతోనే కుల పెద్దమనిషి అయినటువంటి ఐలయ్య మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సంతకాలు పెట్టకుండా ఇబ్బందికి గురి చేసిన వ్యక్తి ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగడంతో సదరు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతునే ఉంది. తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించమని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

స్టీల్‌లోడ్‌తో వెళ్తున్న లారీ దగ్ధం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ వద్ద జాతీయ రహదారి 44పై స్టీల్‌లోడ్‌తో వెళ్తున్న లారీ ఇంజిన్‌లో మంటలు రావడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. నాగాపూర్‌ నుంచి హైదరాబాద్‌కు స్టీల్‌ లోడ్‌ తో వెళ్తున్న లారీ పోచంపాడ్‌ వద్దకు రాగనే ఇంజిన్‌లో షార్టు సర్క్యూట్‌ అయి స్పార్క్‌ రావడంతో మంటలు చెలరేగాయి. మంటలు కొద్ది సమయంలో లారీ కేబిన్‌కు మొత్తం అంటుకుని కాలిపోయింది. ఫైర్‌ ఇంజన్‌ వచ్చి మంటలు ఆర్పింది. ప్రమాదంలో నుంచి లారీ డ్రైవర్‌, క్లీనర్‌ సురక్షితంగా బయటపడ్డారు.